



ఒకటి_రెండు...పది-పదకొండు... ఇరవై తొమ్మిది-ముప్పై-ముప్పై ఒకటి__నీరసం వచ్చింది శోభ నాద్రికి. అయిదు రూపాయలనోట్లు ముప్పైఒకటే వున్నాయి. కాని యిప్పు డతనికి కావలసినవి నూట అరవై రూపాయలు. ఇంకా ఒక అయిదు కాగితం తక్కువయింది.

పొద్దుట్నుంచీ చూశాడు. నెత్తిన చెయ్యి పెట్టడానికి ఎవరూ దొరకలేదు. చూసి చూసి విసుగొచ్చింది. చిరాకెత్తింది. మెడ నొప్పి పుట్టింది. ప్యూన్‌ని పిల్చి అయిదు కాయితం యిచ్చి టీ తెమ్మన్నాడు. అతను అల్లంత దూరం వెళ్ళాక సిగరెట్లు లేవన్న విషయం జ్ఞాపకానికొచ్చింది. వెళ్ళేవాణ్ణి వెనక్కి పిల్చి ఒక అర పెట్టె బర్కిలీ తెమ్మన్నాడు. ఈ రకంగా__కాయితాల మారకం వల్ల__ఇతర వాడకాల వల్ల పది గంటలకి నూటయాభై రెండు, చిల్లర మిగిలింది. చిల్లర కేంలే__నూటఏభై రెండు రూపాయలు మిగిలాయి. పొద్దున్న

ఏడున్నరకి-ఆఫీసుకి వచ్చినప్పుడు అయిదు రూపాయలు లోటు. పదింటికి ఎనిమిది రూపాయలు లోటు. ఇలాగే అనుకుంటూపోతే సాయంత్రానికి అరవై, రేపు తెల్లారేసరికి నూట అరవై-తక్కు-వయ్యేలాగుంది పరిస్థితి.

శోభనాద్రి తాలూకా ఆఫీసులో చిన్న గుమాస్తా! అతనికి వచ్చే జీతం సరిపోదుట-కాదు—సరిపెట్ట డంతే! అంచేత వేన్నీళ్ళకి చన్నీళ్లు తోడవుతాయని పేకాడతాడు. శోభనాద్రిది గెయినింగ్ హాండే!

శోభనాద్రికి అప్పుడప్పుడు లిమిటెడ్‌గా మందు కొట్టే సరదా వుంది. అప్పుడప్పుడు పేకాటలో పదో—పాతికో వస్తే ఈ సరదాకి ఖర్చు పెడతాడు. నష్టపోయిన రోజు ఎవరయినా ఆఫర్ చేస్తే పుచ్చుకుంటాడు- బాధ మరిచి పోడానికి. ఈ పేకాటకయినా, మందు కయినా, శని ఆదివారాలు మాత్ర మే! సో- పోయిన 'రోజు పోగా-వచ్చినరోజు సరదాకి ఖర్చు అయి పోగా- వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడు రా క పో గా—వేన్నీళ్ళు చల్లారి పోతున్నాయి.

శోభనాద్రికీ — అంతరాత్మకీ అప్పుడప్పుడు చర్చ యిలా సాగు తుంది....

'లంచాలు ఎందుకు పడుతున్నావు?'

'అప్పులు తీర్చడానికి!'

'అప్పులు ఎందుకు చేస్తున్నావు?'

'తాగుడు నిమిత్తం అయ్యే ఖర్చుని భర్తీ చెయ్యడంకోసం?'

'తాగుడు ఎందుకు తాగుతున్నావు?'

'పేకాట్లో లాభం వస్తే-ఆనం దాన్ని పంచడం కోసం—నష్టం వస్తే బాధని మింగడం కోసం!'

'పేకాటఎందుకుఆడుతున్నావు?'

'నాది గెయినింగ్ హాండు! వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడవుతాయని!'

మరి ఇబ్బంది లెక్కువయి— సమయానికి అప్పు పుట్టక-లంచాలు దొరక్క ఓ రోజు వెండి కంచం తాకట్టు పెట్టేడు-వందరూపాయలకి! నెలకి నూటికి అయిదు రూపాయల వడ్డీ! 'ఎంతయితేనేం? రేపు ఫస్టుకి తీసేసుకుంటాను కదా!' అనుకుని వెండి కంచం యిచ్చి వంద కాయితం పుచ్చుకున్నాడు. పుచ్చుకుని పదకొండు నెలలు గడిచి పోయాయి. ఇంకో వారం ఆగితే పన్నెండు కూడా లెక్కపెట్టవచ్చు. కాని ఈ వారం లోగానే-ఈ రాత్రి తెల్లారితే మామగారొస్తారు. వెండి కంచం ఆయన పెట్టిందే! ఇప్పు

డాయన వస్తున్నది వెండికంచం కోసం కాదుగాని—అది భోజనాల సమయంలో ఆయన కళ్ళ పడక పోతే-తన ఇజ్జత్ అంతా ఖరాబు అవుతుంది. అంచేత వెండికంచం తనచేత బడితేనే కాని తెల్లారడానికి వీలులేదు. దానికింకా ఎనిమిది రూపాయలు లోటు!

ఎవడో ఒకడు తాసిల్దారుగారి సంతకం కోసం వస్తే-వాడి దగ్గరో అయిదో, పదో ఒడకచ్చు అని చాలా ఆశగా కూర్చున్నాడు. పోనీ ఎవరినయినా . అప్పు అడుగుదా మంటే—ఈ రోజు మరి ఇరవై నాలుగో తారీకు. పెద్ద దొరగారూ-పెద్ద దొరగారి ప్యూనూ తప్ప ఆఫీసులో మిగిలిన వాళ్ళందరూ శివాలయాలే! పెద్ద దొరగారిని అప్పు అడగడం బాగుండదు కదా! ప్యూన్‌ని అడగవచ్చు. కాని వాడి దగ్గర నెలకి—నూటికి పదిహేను రూపాయల వడ్డీ!

"నమస్తే!"

ఓసారి చెయ్యి ఎత్తి దించాడు శోభనాద్రి. ఎదురుగా పది పద్దెనిమి దేళ్ళ కుర్రాడున్నాడు. కాలేజీలో చదువుతున్నాట్ట. తాసిల్దారు గారి సంతకం కోసం వచ్చాడు. శోభనాద్రి కాళ్ళకి తగిలాడు.

* * *

కేవలం తాకట్టులమీద-తాకట్టులు తాకట్టులు చెయ్యడం మీద—ఏ మాత్రమో తక్కువగా పావుకోటి సంపాదించాడు గజానందం.

నూట అరవై రూపాయలు లెక్కపెట్టి గజానందం చేతిలో పెట్టాడు శోభనాద్రి. డబ్బు పట్టుకుని లోపలికి వెళ్ళాడు కంచం తెద్దామని. లోపల మూడు గదులు దాటి నాలుగో గదిలో సంభాషణ-

గజానందం: ఏరా గాడిదా! ఇప్పటి దాకా ఎక్కడికెళ్ళేవు?

గాడిద: సినిమాకి వెళ్ళేను.

గజానందం: అయితే నా జేబులో పది కాయితం నువ్వే పట్టుకు పోయావన్న మాట!

గాడిద: అవును-నేనే!

గజా: చెప్పకుండా తీసెయ్యడమే నేవిఁటి?

గాడిద: చెప్పడానికి నువ్వు లేవు. నువ్వున్నా అడిగితే ఇవ్వవు. నువ్వు లేవు కనుక చెప్పకుండా తీశాను.

గజా: అరి గాడిదా! ఏం తేరగా వస్తుందనుకున్నా వేంట్రా డబ్బు? నిన్నూ....(ఒకటి వెయ్యబోయి వుంటాడు)

గాడి: ఆగు! నువ్వు నన్ను గాడిదా అన్నా సరే-గాడిద కొడుకన్నా సరే! కాని ఒంటి మీద

చెయ్యి పడ్డానికి వీలు లేదు. ఇదిగో నీ పది కాయితం.

గజా: మరి సినిమా కెలా వెళ్లావ్?

గాడి: అసలు నేను సినీమాకి వెళ్ళలేదు. డబ్బు సంపాదన నీకే కాదు- నాకూ చేతవును. రేపు వ్యాపారం పెట్టుకుందాం అంటే పెట్టుబడి కూడా యిచ్చేలా లేవు నువ్వు. ఆ పెట్టుబడి కోసమే పది కాయితం కావలసొచ్చింది. మా కాలేజీలో పూర్ బోయ్స్ ఎయిడ్ ఫండుకి అప్లికేషను పెట్టేను. ఇన్‌కమ్ సర్టిఫికెట్ కావాలి. దాని మీద తాసిల్దారు సంతకం కావాలి. అక్కడ గుమాస్తాలకి లంచం ఇవ్వాల్సొచ్చింది. అందుకని నీ జేబులోంచి తీసింది పది కాయితం యిచ్చేను.

గజా: తాలూకాఫీసు గుమాస్తాకి రూపాయిస్తే చాలు! పదివ్వాలేటి?

గాడి: రూపాయి-కేసు నిజమైందయితేను- నేను వేసిన ఆదాయం రైటయితేను. ఓ మూడు సున్నాలు తక్కువేసేను. అప్లికేషను ఫారంలో నీ పేరుంటుంది. నీ కీర్తి తెలియని వాడెవ్వడూ లేడీ వూళ్లో! పైగా ఈ రోజే ఇచ్చెయ్యాలి అప్లికేషను. అందుకే పది అడిగేడు గుమాస్తా. ఇచ్చేను. పూర్ బోయిస్ ఎయిడ్ ఫండులో ఎనభై రూపాయలు తెచ్చుకున్నాను. నీ పది నీ కిచ్చేశాను- అంతే!

గజానందం సంతోషించేడు. అక్రమసంపాదన స్వేచ్ఛగా జరగాలంటే అడ్డొస్తాడనుకున్న వాడికల్లా ఎరవెయ్యటం మంచి బిజినెస్ లక్షణం!

* * *

శోభనాద్రి ఈ సంభాషణ అంతా వీధిలోంచి విన్నాడు. గజానందం వెండి కంచం తెచ్చి యిచ్చేడు. అది పుచ్చుకుని శోభనాద్రి యింటికి వెళ్ళేడు.

గజానందం కొడుకు కారణంగా పూర్ బోయిస్ ఎయిడ్ ఫండు తాలూకు ఎనభై రూపాయలూ పోగొట్టుకున్న ఇంకొక నిజమైన పేద విద్యార్థి నష్టానికీ, తను లేక తన లాంటి యింకొకడు (కరణం గాని-రెవెన్యూ యిన్స్పెక్టరు గాని-తాసిల్దారుగాని) పది రూపాయలు లంచంతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వడానికీ- ఏమయినా సంబంధం వుందేమోనని కాదు శోభనాద్రి ఆలోచిస్తున్నది!

రేపు మామగారి రాక వల్ల అయ్యే ఖర్చు సంపాదించుకోడానికి పేకాడాలంటే పెట్టుబడికి ఎవరిని అప్పు అడగాలా అని! *